## క్లుప్తంగా

### వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు ప్రశ్నలు అడుతున్న ఎంఈఓ గిరిజ

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సామర్థ్యాల పరంగా వెనుకబడిన పిల్లలపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ గిరిజ ఆదేశించారు. బుధవారం శ్రీబొమ్మరాజుపురం ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా పాఠాలను చెప్పాలన్నారు. మండలంలో మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలతో పెట్టాల్సిన బాధ్యత హెచ్ఎంలపై ఉందన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వెంకటేశులు పాల్గొన్నారు.

### జానపద గాయని సుమతికి సత్కారం



సుమతిని సత్కరిస్తున్న సీపీఐ నాయకులు

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లిపల్లె సచివాలయంలో ఆరోగ్య కార్యకర్తగా పనిచేస్తున్న సుమతి జానపద గేయాలు పాడటంలో దిట్టగా పేరు తెచ్చుకున్నారు. ఆ గేయాలే ఆమెకు మంచి గుర్తింపు తెచ్చాయి. సీపీఐ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్ర స్థాయిలో విజయవాడలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో ఆమె పాల్గొని తృతీయ స్థానంలో నిలిచింది. కేంద్ర సీపీఐ కార్యదర్శి రాజా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చేతుల మీదుగా రూ.5వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, షీల్డ్‌ను సుమతి అందుకుంది. ఈ సందర్భంగా సుమతిని సచివాలయ సిబ్బంది అభినందించారు.

### ఐటీఐ విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న హెచ్ఆర్ శంకర్

విజయపురం: ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు పారిశ్రామిక రంగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సింక్రో సిస్టమ్స్ హెచ్ఆర్ శంకర్ తెలిపారు. బుధవారం మాధవరం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు ఆయన ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి పరిశ్రమలు సిద్ధంగా ఉన్నాయని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ లలిత, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్

పాలసముద్రం: తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేసి వైద్యాధికారి మాట్లాడారు. గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని కోరారు. ప్రసవానంతరం శిశువుకి 6 నెలల వరకు కేవలం చనుబాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆ తర్వాత తృణధాన్యాలు, కిచిడి, పొంగలి, పప్పులు, పళ్లు ఇవ్వాలని, తరువాత క్రమక్రమంగా పిల్లలు తినే ఆహారం మోతాదును పెంచాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

పాలసముద్రం: మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అరుణకుమారి కోరారు. బుధవారం తిరుమలరాజుపురంలో సర్పంచ్ జీవిత అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో తమకు తెలియజేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, వీఆర్ఓ శీను, రైతులు పాల్గొన్నారు.

# చిర్రెత్తిస్తున్న ట్రాఫిక్

పుత్తూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక అంబేడ్కర్ సర్కిల్, ఎంబీరోడ్డు, ఆర్డీఎం గేటు వద్ద ఈ సమస్యలతో వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. అయినా ట్రాఫిక్‌ను గాడిన పెట్టే దిశగా పోలీస్ యంత్రాగం సరైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

- భారతి బస్సుల పార్కింగ్‌తో సమస్యలు
- నిత్యం అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని పోలీసులు



అంబేడ్కర్ సర్కిల్ వద్ద పార్క్ చేసిన భారతి బస్సు

పుత్తూరు: పుత్తూరు కొన్నేళ్లుగా విద్యాలయాలకు నెలవుగా అభివృద్ధి చెందింది. పట్టణ జనాభా 63,175 కాగా, రోజూ ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు సుమారు 20 వేలకు పైగా పుత్తూరుకు వివిధ వాహనాల్లో వచ్చి వెళ్తుంటారు. పట్టణంలోకి వచ్చిన విద్యార్థులను ఆయా కళాశాలల వద్దకు తీసుకెళ్లేందుకు పోటీపడే ఆటోలు సుమారు వెయ్యికి పైగా ఉంటాయి. వీటితో పాటు ఇతర వాహనాలు పుత్తూరులో పరుగులు తీస్తుంటాయి. దీనికితోడు భారీ వాహనాలు సైతం పట్టణంలోకి వస్తూ మరింత ఇక్కట్లకు గురిచేస్తున్నా వీటిని నియంత్రించడానికి పోలీసులు ప్రత్యేకంగా తీసుకుంటున్న కార్యాచరణ ఏమీ లేదనే చెప్పాలి. కేవలం నలుగురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒకరికి ఆఫ్ కాగా ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తుంటారు. ఈ ముగ్గురితో ఏమాత్రం ట్రాఫిక్‌ను నియంత్రిచగలరో పోలీసు ఉన్నతాధికారులకే ఎరుక.

### ప్రైవేటు బస్సులతోనే ట్రాఫిక్ సమస్య

పుత్తూరులో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం భారతి బస్సులే కారణమని ప్రతి వాహనదారుడు చెబుతాడు. ప్రధాన కూడలి అయిన అంబేడ్కర్ సర్కిల్ వద్ద రోజూ ఉదయం 7 గంటల నుంచి భారతీ ప్రైవేటు బస్సులు ఒక్కోటి కనీసం అరగంట పాటు పార్క్ చేసి, ప్రయాణికులతో బస్సు నిండిన తర్వాతే బయలుదేరుతూంటాయి. ఇది స్థానికుల పోలీసులకు తెలియంది కాదు. ఈ బస్సు పక్కనే ట్రాఫిక్ కానిస్టేబుల్ డ్యూటీ చేస్తుంటాడు. అయితే అతనికి సదరు భారతి బస్సును అక్కడి నుంచి కదలించే ప్రయత్నమైతే చేయరు. ప్రైవేటు బస్సుల నుంచి నెలవారీ మామూళ్లను పోలీసులు అందుకుంటూ వీటిపై ఏ చర్యలూ తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తగ్గట్టుగానే ప్రైవేటు బస్సు డ్రైవర్ల వ్యవహార శైలి ఉంటోంది. రోడ్డుకు అడ్డంగా ఉన్న బస్సును తీయాలని ఇతర వాహనదారులు భారతి బస్సు డ్రైవర్లతో ఘర్షణ పడిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. అయినా సరే ఆ డ్రైవర్లలో ఏ మార్పూ లేదు. దీనికి తగ్గటు వాహనదారులు కాసేపు ఆగి వెళ్తారులే అనే తీరులో పోలీసుల వ్యవహార శైలి ఉంది. దీంతో ప్రజల ట్రాఫిక్ కష్టాలు షరా మామూలయ్యాయి. పోలీసు ఉన్నతాధికారులైనా పుత్తూరులో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించే దిశగా పటిష్ట చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

**ట్రాఫిక్ కానిస్టేబుల్ మాట వినేదెవరు?**

అంబేడ్కర్ సర్కిల్, డీఎస్పీ కార్యాలయం, ఆర్డీఎం గేట్ వద్ద ఒక్కో కానిస్టేబుల్ డ్యూటీ చేస్తారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ మాట వినే వారు ఎవరు? ప్రతి వాహనదారుడు ట్రా ఫిక్ నిబంధనలు పాటించాలి కానీ ఎవరు పాటిస్తున్నారు? బండి ఆపి ఫైన్ వేస్తే అప్పుడే ఫోన్లు వస్తాయి! వాడు మా వాడంటూ.. ఏంచేయాలి? ప్రైవేటు బస్సులకు ఫైన్ వేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తాం.

– కేవబీ. సురేంద్రనాయుడు, సీఐ, పుత్తూరు.



పుత్తూరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్య





డీఎస్పీ కార్యాలయం వద్దే ట్రాఫిక్, అంబేడ్కర్ సర్కిల్ వద్ద మరో భారతి బస్సు పార్కింగ్

### భవిత కేంద్రం పరిశీలన



భవిత విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

నిండ్ర: స్థానిక భవిత కేంద్రాన్ని బుధవారం స్థానిక ఎంఈఓ శ్రీధర్‌రాజు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడారు. వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. ఎవరెవరికి దేనిపై ఆసక్తి ఉందో అడిగి తెలుసుకున్నారు.

### పౌష్టికాహారం తీసుకోవాలి

నిండ్ర: బాలింతలు, కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్యామల అన్నారు. బుధవారం మండలంలోని కావునూరు అంగన్ వాడీ కేంద్రంలో బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం, పరిసరాల శుభ్రత, ఆహారంలో తృణధాన్యాల ఆవశ్యకత..తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### రాయితీపై మామిడి రైతులకు ఫ్రూట్ కవర్లు

వెదురుకుప్పం: మామిడిలో టేబుల్ రకాల కోసం మామిడి కాయలకు కట్టడానికి ఫ్రూట్ కవర్లు రాయితీపై ఇస్తున్నట్టు ఉద్యానవన శాఖ అధికారిణి సాగరిక తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ, ఫ్రూట్ కవర్లు కావాల్సిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతాల జెరాక్సులు సమర్పించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పుడు నమోదు చేసుకున్న రైతులకు జనవరిలో ప్రభుత్వం ధర నిర్ణయించి ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కవర్లు అందజేస్తారని పేర్కొన్నారు. దీనిని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 7995086960 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆందోళన



ఎంఈఓలకు వినతిపత్రం ఇస్తున్న ఆయాలు

నగరి: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్లకు పెండింగ్‌లో ఉన్న 5 నెలల జీతాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకులు ఆందోళన చేశారు. స్కూల్ ఆయాల అసోసియేషన్ తరపున ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయలకు వినతిపత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, స్కూల్ ఆయాల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జయకుమారి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్లకు ఐదునెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను కూటమి ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 108 జీవో ప్రకారం రూ.11,500 జీతాలు వారి ఖాతాలకు జమ చేయాలన్నారు. ఆయాలపై రాజకీయ వేధింపులు మానుకోవాన్నారు. ఆయాలకు బాత్రూంలు శుభ్రం చేయడానికి చీపురు కట్టలు, సోపులు, ఫినాయిల్, గ్లౌజ్‌లు, పాదరక్షలు, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల స్కూలు ఆయా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మి, నేతలు గీత, కళ, సరస్వతి, తులసి, మంజుల, ఏఐటీయూసీ నాయకులు నాగభూషణం, మూర్తి, సదాశివం, సీత, యమున, వేణి పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధికి సహకారం





హాజరైన సర్పంచులు, కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, మాట్లాడుతున్న కార్యదర్శి కుమార్

–ఈఓపీఆర్డీ పురుషోత్తం

వెదురుకుప్పం: పంచాయతీల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఈఓపీఆర్డీ పురుషోత్తం కోరారు. వెదురుకుప్పంలో సుస్థిర అభివృద్ధిపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి గల గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రధానంగా నీటి సౌకర్యం సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంటావారిపల్లె కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ, గ్రామాలను పరిశుభ్రమైన హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలకపాత్ర అని చెప్పారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### డిగ్రీ ఫస్టియర్ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల అటానమస్ అర్హత సాధించిన తరువాత తొలిసారిగా విడుదల చేసిన మొదటి సంవత్సరం ఫలితాలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విడుదల చేశారు. బుధవారం కళాశాలలో ఆయన పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ వేణుగోపాల్ సమక్షంలో ఫలితాలు విడుదల చేశారు. 74 శాతం ఉత్తీర్ణత సాధించడంతో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.భాస్కర్‌రాజు, ఉప పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.రమేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపకరణాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న వీఎం థామస్

కార్వేటినగరం: దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇచ్చే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ అన్నారు. బుధవారం శ్రీరంగరాజపురంలో ప్రత్యేక అవసరాల గల వారి కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నవారు సదరం సర్టిఫికెట్, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉన్న వారు ఈ పథకానికి అర్హులన్నారు. నియోజకవర్గానికి 10 మంది నడవలేని వారిని గుర్తించి వారికి చార్జ బుల్ స్కూటర్ ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఎంపీడీఓ మోహన్‌మురళి, టీడీపీ నాయకులు, వికలాంగులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

## ఉన్న ఇళ్లు తీసుకుంటే ఎక్కడ ఉండాలి ?



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

- సర్వీసు రోడ్డు పేరిట మళ్లీ భూసేకరణ అన్యాయం
- ఆర్డీఓకు నెత్తంకండ్రిగ గ్రామస్తుల మొర

నగరి : జాతీయ రహదారి అధికారులు ఇష్టారాజ్యంగా స్థలసేకరణ చేపడుతున్నారని, ఉన్న ఇళ్లు కూడా వారే తీసుకుంటే తాము ఎక్కడ ఉండాలని నెత్తంకండ్రిగ గ్రామ ప్రజలు ఆర్డీఓ భవానీశంకరి ఎదుట వాపోయారు. బుధవారం వారు ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జాతీయ రహదారి కోసం ప్రభుత్వం అడిగిన వెంటనే ఇళ్ల స్థలాలను వదిలేశామన్నారు. ఆ స్థలం పోను మిగిలిన కొంత స్థలాల్లో తాము ఇల్లు నిర్మించుకున్నామని, ఇప్పుడు సర్వీసు రోడ్డు పేరిట మళ్లీ జాతీయ రహదారి అధికారులు భూసేకరణ చేయడం అన్యాయమన్నారు. చాలామంది పేదలకు ఇప్పుడు నివాసం ఉంటున్న ఇళ్లు మాత్రమే ఉన్నాయన్నారు. వాటిని కూడా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రెండవసారి తీసుకుంటే తాము ఎలా బతకాలి ? అంటూ ఆర్డీఓ వద్ద తమ ఆక్రోశం వెళ్లగక్కారు. ఈ ప్రాంతంలో స్కూలు, చర్చి కూడా ఉన్నాయని, తమ ఇళ్లు ఉండేలా చూడాలన్నారు. ఆర్డీఓ స్పందిస్తూ అధికారులతో చర్చించి గ్రామసభ నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. బాధితులతో పాటు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, 9వ వార్డు కౌన్సిలర్ దేవరాజులు, బాధితులు కృష్ణమూర్తి, రామలింగం, లక్ష్మీపతి, సలీం, చంద్రశేఖర్, గంగాధరం, దేవరాజులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది



నారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రోజా

–మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. పుత్తూరు మండలంలోని గొల్లపల్లె గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవేంద్రరెడ్డి తల్లి నారాయణమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం ఆ గ్రామానికి వెళ్లిన ఆమె నారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల తడుకు గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలాజి మృతి చెందారు. గ్రామానికి వెళ్లిన ఆమె బాలాజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుల కుటుంబాలను పరామర్శించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



బాలాజి చిత్రపటం వద్ద..

## నిమజ్జనంతో ముగిసిన గంగమ్మ జాతర



పురవీధులలో ఊరేగుతున్న గంగమ్మ



భక్తులను ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన



ఆకట్టుకున్న మహా శక్తి వేషధారులు

కార్వేటినగరం: గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని బుధవారం వేకువ జామున ఒంటి గంటకు బంగారమ్మ ఆలయం నుంచి నగరంలోని నాలుగు రాళ్లవరకు మేళతాళాలు. ప్రత్యేక వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ఇంటింటా కర్పూర నీరాజనాలు సమర్పించారు. అమ్మవారి వెంట పెద్ద సంఖ్యలో మహిళలు వెయ్యి కళ్ల దుత్తలను మోసి మొక్కులు చెల్లించారు. అలాగే యువత ఆధ్వర్యంలో బండ వేషం, రాక్షస వేషం, గరగాటం, మహాశక్తి వేషాలతో ఆకట్టుకున్నారు. జాతరను తిలకించడానికి మండలంలో నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. జనసందోహంతో వీధులు నిండాయి. నడి వీధిలో కొలువుదీరిన గంగమ్మ, అలాగే బంగారమ్మ వద్ద భక్తులు మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారిని బాణసంచా పేలుస్తూ, మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నగరం సమీపంలోని కోట చెరువులో నిమజ్జనం చేశారు. ఆలయ అధ్యక్షుడు కె.ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలి, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, గ్రామస్తులు పాల్గొన్నారు. జాతర సంబరాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో ఎస్ఐలు రాజ్‌కుమార్, సుమన్,100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఘనంగా పెన్షనర్స్ డే



నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర, జిల్లా కమిటీ నేతలు

నగరి: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు టి.జయరామనాయుడు మాట్లాడుతూ, లైఫ్ సర్టిఫికెట్లు తీసివ్వడం, పెన్షన్ సంబంధిత సమస్యలు పరిష్కరించడంతో అసోసియేషన్ తన ప్రత్యేకతను చాటుకుంటోందని అభినందించారు. విశ్రాంత ఉద్యోగులు ఒక్కటై భవనాన్ని నిర్మించుకుని కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగ విరమణ చేసి 15 ఏళ్లు పూర్తయిన పెన్షనర్లు సుబ్రమణ్యం, దేవసేనమ్మ, నటరాజన్, లక్ష్మమ్మ, నారాయణమ్మ, ఏలుమలై, కళావతి, సాల్వసుబ్రమణ్యం రాజు, రామలింగంలను సన్మానించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏ.జయచంద్రుడు, గౌరవాధ్యక్షులుగా ఓ.బాలసుబ్రమణ్యం, అసోసియేట్ అధ్యక్షులుగా ఎంఎ జయరాం, టీఎస్ రామ్మూర్తి రెడ్డి, కోశాధికారిగా కె.జయరాం, ఉపాధ్యక్షులుగా శ్రీహరి, నీలకంఠారెడ్డి, మురళీధర్, కైలాసం, కార్యదర్శులుగా నారాయణరాజు, లక్ష్మీకాంతమ్మ ఎన్నికయ్యారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు చెంగారెడ్డి, పుత్తూరు శాఖ అధ్యక్షులు భాస్కర్‌రాజు, ఎస్టీఓ చంద్రశేఖర్, బ్యాంక్ మేనేజర్ రియాజ్‌బాబు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామచంద్రన్ పాల్గొన్నారు.